



నల్లజర్లలో బాబు







కొవ్వూరులో..

నల్లజర్లలో..

మన జెండా ఎగరాలి..

కొవ్వూరులో పోటీచేసేది చంద్రబాబే : ముప్పిడి



గత ఐదేళ్ల జగన్మోహనరెడ్డి విధ్వంసకర పాలనతో ప్రజలు విసుగుచెందారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉచిత ఇసుకను అందించాం. వైసీపీ నిబంధనలు తుంగలో తొక్కి గోదావరిలో ఇసుకను దోచుకుంటున్నారు. దీంతో గామన్ బ్రిడ్జిపై స్తంభం కుంగింది. డ్రెజ్జింగ్ వల్ల ఇసుక, పడవ కార్మికులు ఉపాధి దెబ్బ తింది. హోంమంత్రి కొవ్వూరులో ఓటమి భయంతో గోపాలపురం వెళ్లిపోయారు. కొవ్వూరులో పోటీచేసేది నేను కాదు.. మన చంద్రబాబే.



మీతోనే మేమంతా : కొవ్వూరులో విక్టరీ సింబల్ చూపుతున్న యువత



బాబును చూడాలని : డాబాలపైకి ఎక్కిన జనం



అదిరిన రోడ్ షో : కొవ్వూరులో రోడ్‌కు ఇరువైపులా జనం

గాలి మాటలు నమ్మొద్దు.. మీ సంక్షేమానికి నాది హామీ

- రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తు
- కూటమిని గెలిపించండి
- కొవ్వూరు అన్ని విధాలా అభివృద్ధి చేస్తా
- కొవ్వూరులో చెత్త గోపాలపురాన బంగారమా?
- ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేస్తా
- కొవ్వూరు, నల్లజర్లలో ప్రజాగళం సభల్లో చంద్రబాబునాయుడు

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/కొవ్వూరు/నల్లజర్ల, ఏప్రిల్ 4 : కొవ్వూరు, నల్లజర్ల జనసంద్రమయ్యాయి. ఎటుచూసిన జనమే.. ఇసుకేస్తే రాలనంతా జనం తరలి వచ్చారు.. ఉదయం నుంచి తమ నాయకుడు చంద్రబాబు ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూశారు. మహిళలు, యువకులు, పెద్దలు తారతమ్యం లేకుండా సభలకు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఇటు కొవ్వూరు పట్టణం.. అటు నల్లజర్ల జనంతో నిండిపోయాయి. కొవ్వూరు పట్టణంలోని దొమ్మేరు రోడ్‌లో మట్టే ప్రసాద్ రైస్‌మిల్లులో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌లో 4.30 గంటలకు చంద్రబాబు దిగారు. అక్కడ నుంచి కార్లు, బైక్‌లపై కార్యకర్తలు, నాయకులు మెరకవీధి, బస్టాండ్ మీదుగా విజయవిహార్ సెంటర్ వరకు 2 కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద రైతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ర్యాలీగా 5.20 గంటలకు విజయవిహార్ సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభలో ప్రసగించారు. కొవ్వూరు పట్టణానికి ఎన్నోసార్లు వచ్చా. ఈసారి మాత్రం ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. ప్రజాగళం యాత్ర ద్వారా మీలో చైతన్యం తీసుకురావడానికి వచ్చిన నాకు ఆడబిడ్డలు, యువత, తమ్ముళ్లను చూస్తే ఏ మాత్రం అనుమానం లేదు. గెలుపు మనదే అన్నారు. గోదావరి పుష్కరాల్లో నేనే అభివృద్ధి చేశా. మళ్లీ హామీ ఇస్తున్నా కొవ్వూరు నా సొంత నియోజకవర్గంగా భావించి అభివృద్ధి చేస్తా. మీ బాధ్యత సౌమ్యుడు, న్యాయవాది, సేవ చేయడంలో దిట్ట అయిన కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించండి. రాష్ట్రాన్ని కాపాడుకుందాం. అత్యధిక మెజార్టీ రావాలి. ఈ ఎన్నికలు ఏకపక్షంగా జరగాలని బాబు కోరారు. ఏ ఒక్కరైనా వైసీపీ తరపున పనిచేస్తే మనం కూర్చున్న కొమ్మను మనమే నరుకున్నట్టు అవుతుందన్నారు. పోలవరం నుంచి విజ్జేశ్వరం వరకు గోదావరిలో యంత్రాలతో డ్రెజ్జింగ్ చేసి ఇసుక తోడేయడంతో గామన్ వంతెన కుంగిపోయింది. హోంమంత్రిగా ఆమెకు అధికారాలు లేవుగాని, దోపిడీకి మాత్రం ఫుల్ అధికారాలు ఉన్నాయన్నారు. అత్యాచారాలపై ప్రశ్నిస్తే సాధారణంగా జరుగుతాయని బదులిచ్చిన హోంమంత్రి వనితకు ఆ పదవిలో కొనసాగే అర్హత ఉందా అని ప్రశ్నించారు. దొమ్మేరులో దళిత యువకుడిని అక్రమంగా అరెస్టు చేయడంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో దళితులు తిరగబడడంతో మంత్రి భయపడిపోయి పారిపోయిందన్నారు. కొవ్వూరులో చెత్త గోపాలపురంలో బంగారమా అన్నారు. ఇది న్యాయమా అన్నారు. జగన్మోహనరెడ్డి దీనికి సమాధానం చెప్పాలి. నీ హోంమంత్రి కొవ్వూరులో గెలవకపోతే నిన్ను ఎందుకు గెలిపించాలన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజల శ్రేయస్సు అవసరం లేదు. ధనార్జనే లక్ష్యం. అటువంటి దుర్మార్గుడు జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ప్రతి ఇంటిలో టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో కలిసి ముందుకు సాగాలి. ఈ రాష్ట్రం కోసమే ఈ పొత్తు అన్నారు. 2022 ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై న్యాయవాదులు గట్టిగా పోరాడుతున్నారు. ఆ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ రాష్ట్రాన్ని కాపాడుకోవడం మా ముగ్గురి బాధ్యత కాదు.. మనందరిదీ. కూటమిని గెలిపించండన్నారు. చంద్రబాబు నాయుడికి కొవ్వూరు నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు ఘన స్వాగతం పలికారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు నాగలి, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి గద బహూకరించారు. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న కొవ్వూరు ఎంపీపీ కాకర్ల నారాయుడికి చంద్రబాబు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల జంక్షనులో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. జగన్ ఎంతో మోసం చేసి ఏమీ తెలియనట్టు నంగనాచిగా మాట్లాడతాడు. ముందు సిద్ధమన్నాడు. హోర్డింగులు పెట్టాడు. ఒక్కొక్క మీటింగుకు 1500 బస్సులు. ఈ రాష్ట్రం వీళ్ల తాత జాగీరా? గోపాలపురం నుంచే పోలవరం కాలువ పోతోంది. ఈ పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి ఒక వరం వంటిది. దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టు. 50 లక్షల క్యూసెక్కుల నీళ్లు. ఆ ప్రాజెక్టు ప్రమాదంలో పడితే తూర్పు, పశ్చిమ గోదావరి చాలా భయంకరంగా తయారయ్యే పరిస్థితి వస్తుంది. ఇప్పుడు పోలవరాన్ని జగన్ నాశనం చేశాడు. జగన్ స్వార్థానికి, అవినీతికి పోలవరం బలైపోయింది. నిప్పులాగా బ్రతికాం. జగన్ రాజకీయ కక్షతో బురద వేయడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆకాశంపై ఉమ్మి వేయడానికి చూస్తే అది ఆయన ముఖాన్నే పడుతుందన్నారు. ఎస్సీలకు నేను తీసుకొచ్చిన 27 పథకాల అమలు ఆపేశాడు. నా ఎస్సీలని అంటున్నావ్.. వాళ్లకు మేలు ఏం చేశావని అడుగుతున్నాం. జగన్ దళితులకు ఒక్క కార్యక్రమం కూడా చేయకుండా ద్రోహం చేశాడు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి సైకో. తూర్పుగోదావరిలో ఒక దళిత డ్రైవరును వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చంపి డోర్ డెలివరీ చేశాడా లేదా?.. మాస్కు అడిగిన పాపానికి విశాఖలోని డాక్టర్ సుధాకర్‌ని పిచ్చివాడిని చేసి చంపేశారు. సీతానగరంలో ఇసుక దోపిడీపై ప్రశ్నిస్తే శిరోముండనం చేయించారు. ఎస్సీలను చంపిన వాళ్లను పక్కన పెట్టుకుని ఊరేగుతావా?. అందుకే రంపచోడవరంలో ఆ ఎమ్మెల్సీ వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయబోతే ఎస్సీ కుర్రాళ్లు వచ్చి ఉరికెత్తించారు, తరిమి తరిమి కొట్టారు. అతడిని ప్రోత్సహించింది జగన్. వైసీపీని పాతిపెట్టాలి. ఆ పార్టీని నామ రూపాలు లేకుండా చేసే బాధ్యత మీదే. ఆంధ్రప్రదేశ్ ఆదర్శం కావాలని ఉంది. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచనతోనే మూడు పార్టీలు కలిసి పొత్తు పెట్టుకున్నాం. మమ్మల్ని అర్థం చేసుకొని ఆశీర్వదించండి. నష్టపోయిన నా తెలుగు జాతిని ఆదుకోవడమే నా ఆలోచన. నాకు వేరే కోరికలేమీ లేవు' అని చంద్రబాబు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగరాజు, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళీ, గన్ని వీరాంజనేయులు, బొరగం శ్రీను, పితాని సత్యనారాయణ, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సుర్యరాజు,బీజేపీ కన్వీనర్ ఘైనం వాసు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టి.వి.రామారావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, నాదెళ్ళ శ్రీరామ్, జి.వి. ప్రసాద్, పరిమి రాధ, బీవీము త్యాలరావు, కాక్లర తులసి, అంద్రు అనిల్, గన్ని హరికృష్ణ, కరుటూరి ధనంజయ్, షేక్ మీరా సాహెబ్, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాసరావు, జమ్ముల సతీష్, గంటా శ్రీను, కండెపు వెంకటరత్నం, నిమ్మలపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో మాట్లాడుతున్న ముప్పిడి.. చిత్రంలో అచ్చిబాబు, ద్విసభ్య కమిటీ సభ్యులు



నల్లజర్లలోనే రాత్రి బస

నారా చంద్రబాబు నాయుడు నల్లజర్లలోనే రాత్రి బస చేశారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్ హాల్‌కి వెళ్ళారు. శుక్రవారం ఉదయం ప్రముఖులతో కాన్ఫరెన్స్, సమావేశాలు నిర్వహిస్తారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు నల్లజర్లలోనే ఉంటారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు నల్లజర్ల హెలిపాడ్ నుంచి హెలికాప్టర్‌లో నరసాపురం బయలుదేరివెళతారు.

బాపిరాజుతో మాట్లాడతా..

జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజుతో నేను స్వయంగా మాట్లాడతా.. మీరంతా కలిసి కట్టుగా పని చేసి పార్టీని గెలిపించాలి. 2009లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థిగా 2014లో జడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పించా.. బాపిరాజు పార్టీ కోసం బాగా పని చేశాడు. శుక్రవారం మాట్లాడి సమన్వయం చేస్తా. అందరూ కలసి సైకో జగన్‌ను ఓడించి ఫ్యాన్‌ను చిత్తు చిత్తు చేసి డస్ట్‌బిన్‌లో పడేయాలి.



కొవ్వూరులో రైతులు నుంచి వినతిపత్రం స్వీకరిస్తూ..

రాజకీయ ఓనమాలు నేర్పింది చంద్రబాబే : మద్దిపాటి

అతిసామాన్యమైన దళిత కుటుంబం నుంచి వచ్చా.. చంద్రబాబు రాజకీయ ఓనమాలు నేర్పించి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. చదువుకున్న దళిత యువకులను ప్రోత్సహించి సముచిత స్థానం కల్పించాలని ఆరాటపడే వ్యక్తి చంద్రబాబు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే చంద్రబాబుకు మనమంతా అండగా ఉందాం. సూపర్ సిక్స్ ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. 74 ఏళ్ల వయస్సులో మండే ఎండలను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసం తపించే చంద్రబాబు కోసం మనం ఒక అడుగు ముందుకు వేయాలి. కూటమిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.



గోపాలపురంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకటరాజు



ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

లారీని ఢీకొన్న కారు

అక్కడికక్కడే బావాబామ్మర్దుల దుర్మరణం.. తాళ్లూరులో ఘటన

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఘోర ప్రమాదం

పెందుర్తి వద్ద రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్

ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు

పెళ్లి వేడుక నుంచి వస్తుండగా విషాదం

మృతుల్లో తండ్రి, కొడుకు

కలిసికట్టుగా పనిచేయండి

- నేతలు విభేదాలు వీడి పార్టీ విజయం కోసం శ్రమించాలి
- జనసేన పోటీ చేసే స్థానాల్లోను మన అభ్యర్థులే అనుకుని పనిచేయాలి
- రామచంద్రపురంలో నియోజకవర్గ అభ్యర్థుల ముఖాముఖీలో చంద్రబాబు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు ఇంకా ఎన్నో రోజులు సమయం లేనందున నియోజకవర్గాల్లో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. ఇప్పటికీ కాకినాడ పార్లమెంట్ స్థానం పరిధిలో కొన్ని నియోజకవర్గాల్లో సమస్యలున్నాయని, వాటన్నింటినీ ఆయా ఎమ్మెల్యే అభ్యర్థులు చక్కదిద్దుకుని ముందుకు సాగాలని సూచించారు. విభేదాలున్నచోట ఇన్‌ఛార్జులు భేషజాలకు పోకుండా పార్టీని గెలిపించుకోవాలని తేల్చిచెప్పారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కాకినాడ పార్లమెంట్‌స్థానం పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులతో చంద్రబాబు గురువారం ముఖాముఖి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో అభ్యర్థిని బస్సులోకి పిలిచారు. నియోజకవర్గంలో పరిస్థితులు, వైసీపీ బలహీనతలు, ఎన్నికల వ్యూహాలపై ఆయా ఇన్‌ఛార్జులతో ఆరాతీశారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఎలా సమాయత్తంగా ఉన్నారో అడిగి తెలుసుకున్నారు.

ఒకరితో ఒకరికి బొకేలు ఇప్పించి..

కాకినాడ సిటీ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడిని ఢీకొనే విషయంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని చంద్రబాబు హితబోధ చేశారు.ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండబాబు, మాజీ మేయర్ సుంకర పావని మధ్య విభేదాలు ఇకపై ఉండకూడదన్నారు. ఈ రెండు వర్గాలతో చంద్రబాబు ఫొటోలు దిగారు. ఒకరితో మరొకరికి బొకేలు ఇప్పించారు. టికెట్ వచ్చిన నేపథ్యంలో కొండబాబే చొరవ చూపి నేతలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఆదేశాలను కొండబాబు ఆచరణలో పెట్టారు. పావని నివాసానికి గురువారం సాయంత్రం వెళ్లి చాలాసేపు చర్చించారు. దీంతో చంద్రబాబు జోక్యంతో కాకినాడ సిటీలో సమస్యలకు చెక్ పడినట్లయింది. పిఠాపురం నియోజకవర్గం తరపున మాజీ ఎమ్మెల్యే వర్మ చంద్రబాబుతో ముఖాముఖికి హాజరయ్యారు. ఇక్కడ జనసేననుంచి పవన్ పోటీ చేస్తున్న నేపథ్యంలో టీడీపీ శక్తివంచన లేకుండా కష్టపడి పనిచేయాలని చంద్రబాబు సూచించారు. వర్మకు సీటు విషయంలో అన్యాయం జరిగిన మాట వాస్తవమేనన్నారు. అయినా పవన్ విజయం కోసం పార్టీని మరింత చురుగ్గా ముందుకు నడపాలని సూచించారు. పొత్తు నేపథ్యంలో చిన్నచిన్న పొరపాట్లు చోటుచేసుకోవడం సహజమేనని, అవేవీ మనసులో పెట్టుకోకుండా పనిచేయాలని హితబోధ చేశారు. ప్రత్తిపాడులో చిన్నచిన్న సమస్యలున్నాయని, వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సత్యప్రభకు సూచించారు. ఏలేశ్వరంలో పార్టీ నేత బోస్‌తో కొనసాగుతున్న విభేదాలపైనా చర్చించారు. అభ్యర్థిగా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలనే దానిపై పలు సూచనలు చేశారు. కాకినాడ జిల్లా పార్టీ కార్యాలయంలో ఎలాంటి కార్యక్రమా లు నిర్వహించడం లేదని, ఇకపై తరచూ మీడియా సమావేశాలు, అధికార పార్టీ అక్రమాలపై ఎప్పటికప్పుడు స్పందించేలా చొరవ చూపాలని సానా సతీష్‌ను ఆదేశించారు. టీడీపీ, జనసేన విజయం సాధించేందుకు వీలుగా జిల్లాలో ఆయా నియోజకవర్గాలను పార్టీ జిల్లా పరిశీలకుడు సుజయ్‌కృష్ణతో కలిసి తరచూ పర్యవేక్షించాలని ఆదేశించారు. పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులపై చర్చించారు. అధికారపార్టీకి ఎక్కడా ఛాన్స్ ఇవ్వకుండా గట్టిగా పనిచేయాలని సూచించారు. తునిలో ఇటీవల జరిగిన పరిణామాలపైనా యనమల, దివ్యతోను చర్చించారు. ఈసారి ఎలాగైనా గెలిచేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

కోడ్ పర్యవేక్షణలో కంట్రోల్ రూమ్ పాత్ర కీలకం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 4: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు పర్యవేక్షణలో కంట్రోల్ రూమ్ పాత్ర చాలా కీలకమైనదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ అన్నారు. కలెక్టరేట్ స్పందన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాధారణ ఎన్నికలు కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జె.నివాస్ రెవెన్యూ, ఎన్నికల ఇతర అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. రాష్ట్ర జిల్లా సరిహద్దులవద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు వెబ్‌కాస్టింగ్, వివిధ మీడియా ఛానళ్లలో ప్రసారమవుతున్న వార్తాంశాల పర్యవేక్షణ, సువిధ కౌంటర్ ద్వారా రాజకీయపార్టీల ప్రతినిధులు పొందిన అనుమతుల వివరాలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. డీఆర్‌వో తిప్పేనాయక్, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి డిప్యూటీ కలెక్టర్ భారతి, సమాచారశాఖ డీడీ నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బాబురావు, ఐటీ వింగ్ విభాగం అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

14వతేదీలోపు ఓటు నమోదుకు అవకాశం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 4: కొత్తగా ఓటు నమోదు చేసుకునే ఓటర్లు ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని, అదే ఆఖరి తేదీ అని కలెక్టర్ జె.నివాస్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ఓటు హక్కు లేని వారు ఫారమ్-6 దరఖాస్తు చేసుకుని ఓటు నమోదు చేసుకోవాలన్నారు. యువత ఓటుహక్కు నమోదు చేసుకునేలా కళాశాలల్లో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు అప్పారావు, రంబాల వెంకటేశ్వరరావు, రాజశేఖర్,రామ్మోహన్, గదులసాయిబాబా, రావూరివెంకటేశ్వరరావు, ఎన్నికలడీటీ జగన్నాథం పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా జరపాలి: ఎస్పీ

కాకినాడ క్రైం, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు భద్రత కల్పించడానికిగాను జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన కేంద్రాల్లో పోలీసు దళాలు కవాతులను నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి, పోలీసు అధికారి కె.హనుమంతరావు, సీఐలు వీఎల్‌వీకే సుమంత్, బి.నాగేశ్వరనాయక్, శ్రీనివాస్, ఏఎస్పీ భాస్కరరావు, ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ వలయంలో వలంటీర్లు



- వైసీపీ కుట్రలో వలంటీర్లు సమిధలు
- వాళ్ల వేలితో వాళ్ల కన్నునే పొడిపించే కుట్ర
- ఐదేళ్ల నుంచీ 'సొంత' పనులకు
- ఎన్నికల వేళ 'కార్యకర్త'లుగా
- టీడీపీపై బురద జల్లే ప్రయత్నం
- తిరిగొచ్చి జగన్ ముఖంపై పడిన వైనం
- వలంటీర్లను దూరం పెట్టడం సబబేననే కోర్టు
- తీర్పుతో మళ్లీ ఛీ కొట్టించుకున్న పాలకులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జగన్ తన రాజకీయ కుట్రలో భాగంగా వలంటీర్లను సమిధలుగా వాడుకొంటున్నారు. వారి వేలితో వారి కంట్లోనే పొడుస్తున్నారు. తమకు అధికారం చిక్కితే యువతకు లక్షల ఉద్యోగాలు ఇచ్చేస్తామంటూ గత ఎన్నికల్లో జగన్ ఊదరగొట్టారు. తీరా అధికారం చేజిక్కించుకొన్న తర్వాత అవన్నీ 'గాలి' మాటలని తేలిపోయింది. లక్షల ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతకు ఝలక్ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీరు వ్యవస్థను తెచ్చారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం పీజీ చేసిన యువ తను సైతం 'వలంటీరు' పేరుతో పక్కదారి పట్టించారు. దీంతో యువత ఐదేళ్ల కాలాన్ని వృథా చేసు కొంది. తీరా ఎన్నికల వేళ కూడా వాళ్లను మానసికంగా ఇబ్బందులకు గురిచేసే కుతంత్రానికి తెరతీశారు. ఆ బురద అంతా టీడీపీపై నెట్టేయాలని ప్లాన్ వేశారు. కానీ న్యాయస్థానం తీర్పుతో ఆ బురద రివర్స్ వచ్చి 'ఫ్యాను'పైనే పడింది.

రాజీనామా డ్రామా

వలంటీర్లను ప్రభుత్వం ఇంకా నలిపేస్తోంది. ఉద్యోగాలకు రాజీనామాలు చేయించి పూర్తి స్థాయి కార్యకర్తలుగా వినియోగించుకునే దుష్టనీతికి తెరతీసింది. ప్రతి నియోజకవర్గంలో వైసీపీకి బాగా అనుకూలంగా ఉండే కొంతమంది వలంటీర్లతో రాజీ నామాలు చేయించి.. వారికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ అనధికారికంగా జీతం రూపేణా ముట్టజెప్పాలని వైసీపీ పెద్దలు ఇప్పటికే మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ కేవలం రూ.5 వేలు మాత్రమే జీతంగా.. కాదు.. గౌరవ భృతిగా చెల్లించారు. గౌరవ భృతి సరిపోక తాము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఈ ఐదేళ్లలో ఎన్నో సార్లు ప్రభుత్వానికి వలంటీర్లు మొరపెట్టుకున్నారు. అయినా వారి గోడును పట్టించుకున్న వైసీపీ నాయకులే లేరు. ఎన్నికల వేళ మాత్రం వలంటీర్లను నెత్తిన పెట్టుకుని చూసుకుంటున్నారు. దీంతో వైసీపీ నాయకుల రాజకీయ కుట్రలో సమిధలుగా మారిపోయారు. ఇప్పుడు మరో మోసానికి వైసీపీ తెరతీసింది. ప్రభుత్వంపై వలంటర్ల ఆగ్రహాన్ని అణగదొక్కడానికి ప్రలోభాలతో ఆశ పెడుతున్నారు.

టీడీపీపై నిందలా?

వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే లక్షలాది ఉద్యోగాలు కల్పించామని చెప్పుకోడానికి యువతను వలంటీరు పేరుతో మభ్య పెట్టింది. ఉన్నత చదువులు ఉన్న వారు సైతం మనసు చంపుకొని 'సేవ' చేస్తూ వచ్చారు. వలంటీర్లను ఎన్నికల వేళ మరింత అనుకూలంగా వాడుకోవాలని పన్నాగం వేసింది. ఇది గమనించిన ఎన్నికల సంఘం వలంటీర్లను ప్రభుత్వ పథకాల పంపిణీకి దూరం పెట్టింది. వలంటీర్లు తమ సొంత సైన్యమని జగన్, వలంటీర్లు వైసీపీ కోసమే పని చేయాలని వైసీపీ నాయకులు పదేపదే బహిరంగంగా ప్రకటించడం కూడా ఎన్నికల ప్రక్రియలో వలంటీర్లు లేకుండా చేసింది. ఇవేమీ వలంటీర్లు పసిగట్టకుండా ప్రభుత్వం రోజుకో నాటకం తెరపైకి తెస్తోంది. టీడీపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తోంది. వలంటీర్లను టీడీపీకి వ్యతిరేకం చేసి లబ్ధి పొందాలని చూస్తోంది. పింఛన్ల పంపిణీని సైతం ఆ కుట్రకు వాడుకొంది. పింఛన్ల పంపిణీలో వలంటీర్లు లేకపోతే తీవ్రమైన ఇబ్బందులు వస్తాయంటూ ప్రభుత్వం మొసలి కన్నీరు మొదలుపెట్టింది. ఓ వైపు అన్యాయమైన దారిలో నడుస్తూ న్యాయం కావాలంటూ తమకు అనుకూలమైన వారితో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయించడం ద్వారా కోర్టును ఆశ్రయించింది. ఈసీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరింది. కోర్టు కూడా ఈ అభ్యర్థనను తప్పు బట్టింది. వలంటీర్లు లేకుండా మిగతా రాష్ట్రాల్లో పింఛన్లు ఇవ్వడం లేదా? అని ఆక్షేపించింది. ఈసీ తరఫు న్యాయవాది వాదనతో ఏకీభవించింది. దీంతో జగన్ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లు అయ్యింది. తాను టీడీపీపై వేద్దామను కున్న బురద తిరిగొచ్చి తన ముఖంపైనే పడడంతో మిన్న కుండిపోయారు. వాస్తవానికి వలం టీర్లను టీడీపీ అధినేతగానీ, టీడీపీ నాయకులు గానీ కించపరిచిన, నిందించిన సందర్భాలు లేవు. వైసీపీ తమ రాజకీయ లబ్ధి కోసం యువతను వలంటీరు పేరుతో మోసం చేస్తోంది.

అసలుకే ఎసరు

వలంటీర్లను ఎన్నికల ప్రక్రియలో వినియోగించడానికి వీల్లేదని ఎన్నికల సంఘం ఉత్తర్వులివ్వడంతో వైసీపీ పెద్దలు కొత్త కుతంత్రానికి తెరతీశారు. ఇప్పటి వరకూ వలంటీర్లపై లేని ప్రేమ ఒక్కసారిగా తన్నుకొచ్చింది. ఓట్లు దండుకొనే కుట్రలో భాగంగా మమకారం ముంచుకొచ్చింది. వలంటీర్లను కొందరిని తొలగించి, మరికొందరితో రాజీనామాలు చేయించి వైసీపీ కార్యకర్తలుగా వాడుకోవాలనే దురుద్దేశాన్ని అమలు చేస్తోంది. ఐదేళ్ల నుంచీ వలంటీరు పరిధిలోని కుటుంబాలతో వారికి కొంత అనుబంధం ఏర్పడింది. వైసీపీ నాయకులకూ ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతో వలంటీర్లతో ఓటర్లకు ఉన్న అనుబంధాన్ని రాజకీయంగా వాడుకోవడానికి ప్లాన్ వేసింది. దీనిలో భాగంగా ఇన్నాళ్లూ పైసా జీతం పెంచడం చేతగాని పాలకులు ఇప్పుడు వలంటర్లతో రాజీనామాలు చేయించి వేల రూపాయలు ఆశ చూపుతున్నారు. వైసీపీ కోసం పని చేయాలంటూ అనధికార ఆదేశాలిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన మార్చి 16 తర్వాత నుంచీ వలంటీర్ల రాజీనామాలు ఆరంభమయ్యాయి. అంతకు ముందు వైసీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక వలంటీర్లు రాజీనామా చేసి వెళ్లిపోయేవారు. కానీ ఇప్పుడు వందల్లో రాజీనామాలు చేస్తున్నారు. రాజీనామా లేఖల్లో కూడా టీడీపీపై ఆరోపణలు చేయాలని వైసీపీ నాయకులు చెప్పడంతో రాజీనామా లేఖలన్నీ అదే మాదిరిగా ఉండడం గమనార్హం. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వలంటీర్లను 'సేవ' నుంచి తొలగించారు. వైసీపీ నాయకుల గాలి మాటలకు తలొగ్గి కొందరు రాజీనామాలు చేస్తున్నారు. తర్వాత వీరి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీరు తమ ఉద్యోగం కోసం కోర్టులను ఆశ్రయించే అవకాశమూ లేదు. తమకు ఎలాగోలా పీడ వదిలిందని.. మరో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించుకుంటామని కొందరు వలంటీర్లు పరిచయస్తుల వద్ద ధీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం.



జిల్లాలో ఇప్పటివరకూ 174 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ 18, సీతానగరం 5, కడియం 87, దేవరపల్లి 8, రాజమహేంద్రవరం రూరల్ 9, తాళ్లపూడి 12, నల్లజర్ల 1, గోపాలపురం మండలం నుంచి 34 మంది తమ ఉద్యోగాలు వదులుకున్నారు. అయితే అందరూ విచిత్రంగా ఒకే కారణం చూపారని తెలుస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కారణంగా 26 మంది వలంటీర్లను ఉద్యోగాల నుంచి తొలగించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 32 మంది రాజీనామా చేయగా

జిల్లాల వారీగా పరిస్థితి..

31 మందిని అధికారులు తొలగించారు. కాకినాడ జిల్లాలో ఇద్దరు రాజీనామా చేయగా 9 మందిని అధికారులు తొలగించారు. ప్రజాప్రతినిధులు నిబంధనలు పాటించకుండా వలంటీర్లను బలి చేశారు. ఆయా ప్రజా ప్రతినిధులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఉదాహరణకు రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ సమావేశం పెట్టి మరీ వైసీపీ కోసం పని చేయాలని వలంటీర్లను మౌఖికంగా ఆదేశించారు. వాస్తవానికి ఆ సమావేశానికి వెళ్లడానికి వలంటీర్లు నిరాకరించినా ఎంపీ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం.. అధికారులు వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమావేశానికి వెళ్లక తప్పలేదు. పాపం ప్రజాప్రతినిధి చేస్తే ఫలితం వలంటీర్లు అనుభవిస్తున్నారు. ఇలా మొదటి నుంచీ వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను వేధిస్తోంది.

లారీని ఢీకొన్న కారు



- అక్కడికక్కడే బావాబామ్మర్దుల దుర్మరణం
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



పల్లయ్యచౌదరి మృతదేహం



సుబ్బారావు మృతదేహం

గండేపల్లి, ఏప్రిల్ 4: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని తాళ్లూరు హోటల్ ముందు ఆగి ఉన్న లారీని షిఫ్ట్‌కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో బావాబామ్మర్దులు అక్కడికక్కడే మృతిచెందారు. అన్నవరం దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన తమ్మిన సుబ్బారావు(42), తెలంగాణ రంగారెడ్డి జిల్లా బాలానగర్‌కు చెందిన చేకూరి పల్లయ్యచౌదరి (53) కలిసి బుధవారం రాత్రి రాజమండ్రిలోని బంధువుల ఇంట వివాహానికి హాజరయ్యారు. అక్కడి నుంచి తెలిసిన బంధువు ఒకరు అన్నవరంలో ఉండడంతో గురువారం తెల్లవారుజామున అన్నవరం బయలుదేరారు. అన్నవరం సత్యనారాయణస్వామిని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. గండేపల్లి మండలం తాళ్లూరు వచ్చేసరికి సుమారు రెండుగంటలన్నర సమయమైంది. ఆ సమయంలో తాళ్లూరులోని హోటల్ ముందు లారీ డ్రైవర్ భోజనం కోసం లారీని పక్కన ఆపి భోజనం చేస్తున్న సమయంలో కారు అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. కారు సగభాగం లారీ కిందకి వెళ్లిపోయింది. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయినప్పటికీ అవి వారి ప్రాణాలను రక్షించలేకపోయాయి. దీంతో ఇరువురు కారులో లారీ కిందే చిక్కుకుపోయారు. పెద్ద శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురై అక్కడికి వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని కారులో చిక్కుకుపోయిన వారిని బయటకు తీయడానికి విశ్వప్రయత్నాలు చేశారు. కారు లారీ కిందకు వెళ్లిపోవడంతో బయటకు రాలేదు. జేసీబీ సాయంతో కారును బయటకు లాగి కారులో ఉన్న ఇద్దరిని బయటకు తీశారు. అప్పటికే ఇద్దరూ మృతి చెంది ఉన్నారు. దీంతో ఈవిషయాన్ని కుటుంబసభ్యులకు చేరవేయడంతో వారు సంఘటన స్థలానికి వచ్చి బోరున విలపించారు. ఎప్పుడూ అందరితో కలిసి ఉంటూ ఎవరికి ఏ కష్టమొచ్చిన ఆదుకునే వారిని మృత్యువు వెంటాడడాన్ని బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతదేహాలను పోలీసులు పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ సీసీ కెమెరాల ఆధారం బట్టి నిద్రమత్తులోనే ప్రమాదం జరిగి ఉండవచ్చన్నారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.

ఘోర ప్రమాదం

- పెందుర్తి వద్ద రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్
- ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- పెళ్లి వేడుక నుంచి వస్తుండగా ప్రమాదం
- మృతుల్లో తండ్రి,కొడుకు



అతికష్టం మీద బయటకు తీస్తున్న దృశ్యం



రోడ్డుపై క్షతగాత్రులు

పెందుర్తి/తాళ్లపూడి, ఏప్రిల్ 4: విశాఖపట్నం జిల్లా పెందుర్తి సమీపంలో గల అక్కిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారి (నంబర్ 16)పై గురువారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని మినీ వ్యాన్ ఢీకొనడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పెందుర్తి సీఐ ఎల్.రామకృష్ణ నేతృత్వంలో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్ నుంచి క్షతగాత్రులను అత్యంత లాఘవంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామం నుంచి హనుమంతు ఆనందరావు, హనుమంతు చంద్రశేఖర్, చింతాడ ఇందు, అమ్మయ్యమ్మ, బొడ్డేపల్లి జ్యోతి, మెట్ట లక్ష్మి, వెంకటలక్ష్మి, నాగమణి, నీలవేణిలు బుధవారం ఉదయం మినీ వ్యాన్‌లో శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం గోగన్నపేట పంచాయతీ రంగానాథపేటలో జరిగిన బంధువుల వివాహానికి వెళ్లారు. బుధవారం రాత్రి వివాహ వేడుక ముగిసిన తరువాత శ్రీకాకుళం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. వ్యాన్‌ను వినయ్ డ్రైవ్ చేస్తున్నాడు. పెందుర్తి బైపాస్ రోడ్డులో సరిపల్లి సమీపంలో అక్కిరెడ్డిపాలెం వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ క్రమంలో వ్యాన్ ముందుభాగం పూర్తిగా నుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న హనుమంతు ఆనందరావు (45), హనుమంతు చంద్రశేఖర్ (17) చింతాడ ఇందు (58) అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ వినయ్‌తో పాటు మిగతా వారికి తీవ్రగాయాలయ్యాయి. కాగా మృతుల్లో హనుమంతు ఆనందరావు (45), చంద్రశేఖర్ (17) తండ్రీకొడుకులు. వీరంతా దశాబ్దం కిందట పనుల కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి మెరుగ్గానే ఉందని సీఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడమే కారణమని పోలీసులు చెబుతున్నారు. ఆనందరావు కూలి పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా అతని కుమారుడు చంద్రశేఖర్ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు.



ఆనందరావు



చంద్రశేఖర్



ఇందు

ద్రాక్షారామ ఈవోకు షోకాజ్ నోటీసు

ద్రాక్షారామ, ఏప్రిల్ 4: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం ఈవోకు ఎన్నికల నియమావళి సక్రమంగా పాటించడం లేదని రామచంద్రపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాసాగర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆలయ పరిసరాల్లో శిలాఫలకాలు మూసివేయకపోవడం, రాజకీయ పార్టీలకు పులిహోర పంపిణీ చేయడం, దేవస్థానం క్యాలెండరులో రాజకీయ నాయకుల ఫొటోలు ఉంచడం వంటి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించకపోవడంపై రిటర్నింగ్ అధికారి తీవ్ర హెచ్చరికలు జారీచేస్తూ నోటీసు అందిన 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదుపై పరిశీలన జరిపి ఈవోకు నోటీసులు జారీ చేశారు.

హోరాహోరీగా ప్రో కార్ట్ రేసింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ సతీష్‌రెడ్డి



విజేతలతో ఆదిత్య బృందం

గండేపల్లి, ఏప్రిల్ 4: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ప్రాంగణంలో ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయస్థాయి ప్రో-కార్టింగ్ ఎండురెన్స్ చాంపియన్‌షిప్-2024 సీజన్-4 పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలను ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, చెన్నై, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కళాశాలల నుంచి 13 టీమ్‌లకు సంబంధించి 350 మంది సభ్యులు హాజరయ్యారు. కోకోకోలా, అల్టాయిర్, ప్లైమాస్టర్ కంపెనీల సంయుక్త సౌజన్యంతో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన పోటీల్లో మహారాష్ట్రకు చెందిన పీవీడీపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ట్రోజన్) టీమ్ విజేతగా నిలిచి రూ.లక్ష, ఎండురెన్స్ విన్నర్ రూ.85 వేలు నగదు బహుమతి సొంతం చేసుకుంది. రన్నరప్‌గా రఘు ఇంజినీరింగ్ కళాశాల(ఎనిగ్మాటీమ్) రూ.50 వేలు, ఎండురెన్స్ రన్నరప్ రూ.50 వేలు గెలుపొందింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మెకానికల్ విభాగం అధిపతికి, ఉపాధ్యాయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, స్పాన్సర్ కంపెనీల ప్రతినిధుల చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, కోఆర్డినేటర్లు డాక్టర్ శరవణన్, డాక్టర్ భీమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం కేసులో ముగ్గురి అరెస్టు

ముమ్మిడివరం, ఏప్రిల్ 4: మద్యం తరలిస్తున్న ఇద్దరిని, మద్యం అందించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కాట్రేనికోన మండలం కందికుప్ప మద్యం షాపు నుంచి కందికుప్పకు చెందిన పినపోతు ధర్మారావు, దొంతికుర్రుకు చెందిన కొమ్మాబత్తుల బాబాసాహెబ్‌అంబేడ్కర్‌లు 223 మద్యం సీసాలను పల్లం తరలిస్తుండగా ఎస్ఈబీ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. షాపు సూపర్‌వైజర్, గ్రామస్థాయి ప్రజాప్రతినిధి కుమారుడు నాతి కవిరాజు మద్యం సీసాలు ఇచ్చినట్లు నిందితులు తెలిపారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ రామారావు తెలిపారు. కవిరాజును తప్పించేందుకు అధికార పార్టీకి చెందిన ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు ఎస్ఈబీ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం.

18 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

తుని రూరల్, ఏప్రిల్ 4: గంజాయితో ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పోలీసులు 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో బ్యాగ్‌లో గంజాయి ప్యాకెట్లు నింపుకుని ఒడిసాకు చెందిన సంజిత్ లిమ్మ అనే వ్యక్తి సికింద్రాబాద్ వెళ్తున్నాడు. అయితే గంజాయి కొనుగోలు చేసే వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో లిమ్మ తుని రైల్వేస్టేషన్‌లో గంజాయితో పాటు దిగాడు. ఆ గంజాయిని తునిలో అమ్మడానికి ఎదురు చూస్తుండగా ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్ పరిశీలించగా 18 కిలోల 390 గ్రాముల గంజాయి, రూ.92 వేలు పట్టుబడింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు, రామకోటి, గణేష్, శంకర్రావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.గోవిందరావు, కానిస్టేబుల్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం

పండితులు, అధికారుల ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం



పందిరి రాట ముహూర్తం చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 4: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకూ వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామి వారి కల్యాణోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది యాత్రికులు తరలిరానున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఆర్డీవో సత్యనారాయణ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ స్వామివారి కల్యాణోత్సవాల ఏర్పాట్లపై ప్రణాళికను రూపొందించారు. గురువారం దివ్యకల్యాణ మహోత్సవానికి సంబంధించి పందిరిరాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ భూపతిరాజు కిషోర్‌కుమార్ పందిరిరాట వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి కల్యాణోత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. 18 గురువారం స్వామివారి ధ్వజారోహణ, దర్శనములు, 19 ఏకాదశి శుక్రవారం స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణం, 20 శనివారం స్వామివారి పొన్నవాహన మహోత్సవం, 21 ఆదివారం సదస్యం, 22 సోమవారం గౌతమి గోదావరి నదీలో తెప్పోత్సవం, 23 మంగళవారం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, 24 బుధవారం స్వామివారి శ్రీపుష్ప మహోత్సవంతో స్వామివారి ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు 21న పరీక్ష

కాకినాడ రూరల్,ఏప్రిల్ 4: కాకినాడ జిల్లాలోని ఆదర్శ పాఠశాలలు శంఖవరం, హంసవరంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు పనిచేస్తున్నాయో ఆ పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని 5వ తరగతి స్థాయిలో ప్రవేశ పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో ఉంటుందని తెలిపారు. దరఖాస్తు తేదీని ఈనెల 6 వరకూ పొడిగించామన్నారు. వివరాలకు 9491249321, 70329 96442లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటం



రాయవరం, ఏప్రిల్ 4: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన చిత్రకారుడు ఇడుంగమిల్లి సౌధాసాగర్ గీసిన జగ్జీవన్‌రామ్ చిత్రపటం ఆకట్టుకుంది. వివిధ రకాల రంగులతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చిత్రకారుడు తెలిపాడు.

కేసు తారుమారుపై విచారణకు ఆదేశం

గొల్లప్రోలు, ఏప్రిల్ 4: మద్యం స్థానంలో బీరు పెట్టి ఎస్ఈబీ పోలీసులు కేసు తారుమారు చేసిన వ్యవహారంపై విచారణకు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గొల్లప్రోలులో ముగ్గురు వ్యక్తుల వద్ద మద్యం స్వాధీనం చేసుకుని ఆస్థానంలో బీరు సీసాలు ఉంచి ఒక్కరినే అరెస్టు చూపడంపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై ఐజీ ఆరా తీశారు. దీంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. దీంతో ఆమె విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

వృద్ధుల ఇంటికెళ్లి పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తాళ్లరేవు, ఏప్రిల్ 4: మండలంలోని 17 గ్రామ పంచాయతీ, సచివాలయాల్లో అధికారులు పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ప్రతీ పంచాయతీ, సచివాలయాల్లో సిబ్బంది 10 నుంచి 15 మంది దాకా ఉన్నా ప్రభుత్వం సానుభూతి పొందేందుకు పింఛన్లు ఇవ్వకుండా అనేక కథలు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం నుంచి మార్పు వచ్చింది. సచివాలయ ఉద్యోగులు ఉత్సాహంగా పనిచేసి వృద్ధులకు పింఛన్లు అందించారు. నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటికెళ్లి మరీ పింఛన్ అందించారు. చొల్లంగిలో ఉండ్రు నూకాలమ్మ అనే వృద్ధురాలు కుర్చీ సాయంతో వస్తుంటే వెల్ఫేర్ అసిస్టెంట్ హరిబాబు ఎదురెళ్లి పింఛన్ అందించారు. అలాగే యేసూరి సూర్యాకాంతం అనే వృద్ధురాలు మంచంపై లేవ లేని పరిస్థితిలో ఉండడంతో ఆమెకు వెల్ఫేర్ అసిస్టెంట్ దగ్గరకు ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు.

కొత్త కలెక్టర్‌కు బంగ్లా కేటాయింపు ఎప్పుడు?

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్4: కాకినాడజిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కృతికా శుక్లా సెలవులోకి వెళ్లడంతో కొత్త కలెక్టర్‌గా నివాస్ వారం క్రితమే బాధ్యతలు స్వీకరించారు.ఆయనకు ఇంకా కలెక్టరేట్‌బంగ్లా కేటాయించలేదు. కలెక్టరేట్‌లో సామాగ్రిని సిబ్బంది రోజుల తరబడి ప్యాకింగ్ చేస్తున్నారని, ఇంకా బంగ్లా ఖాళీచేయడంలేదని, జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ నివాస్‌కు ఇబ్బందులు తప్పడంలేదని అధికారవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లాలో కలెక్టర్‌గా ఎవరు పనిచేసినా బదిలీ తర్వాత ఇన్ని రోజులపాటు బంగ్లాలోనే తిష్ట వేసిన దాఖలాలు లేవని అధికార వర్గాలు చెబుతున్నాయి.


అధికారులతో సమావేశమైన ఆర్వో వెంకటరావు

12, 13 తేదీల్లో పీవో, ఏపీవోలకు శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 4: ఎన్నికల విధులపై ఈ నెల 12, 13 తేదీల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు కాకినాడ ఆర్వో జె.వెంకటరావు తెలిపారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈ అంశంపై గురువారం సెక్టార్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లతో సమీక్షించారు. శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఎన్నికల విధుల్లో ఉండే పీవో, ఏపీవోలకు ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరుతోపాటు ఇతర ఎన్నికల విధులకు సంబంధించి ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహసీల్దార్ దొర, ఎలక్షన్ డీటీ సీతాపతి రావు పాల్గొన్నారు.

లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై
ప్రత్యేక దృష్టిపెట్టాలి: ఆర్డీవో

కాకినాడ సిటీ, ఏప్రిల్ 4: ఆడశిశువుపట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతోపాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతా లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి ఇట్ల కిషోర్ అధికారులను ఆదేశించారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో కిషోర్.. వైద్యఆరోగ్యశాఖ, రెవెన్యూ లీగల్, స్త్రీ శిశు సంక్షేమం అధికారులు, స్వ చ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి గురువారం సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్‌స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. సమా వేశంలో డీఐవో కె.రత్నకుమార్, గైనకాలజిస్ట్ పి.సుజాత, జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ఇందిరా శ్రీశైలజ, పీడియాట్రిషన్ ఎం.కీర్తిప్రియ, వివిధ సెంటర్ల సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఎన్‌జీవో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవిలో ఉపాధి కూలీలకు ప్రత్యేక సౌకర్యాలు

● తాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలి: కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 4: వేసవి దృష్ట్యా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటు లో ఉంచాలని కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకంపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు మండుతున్నందున పనిదగ్గర టార్పాలిన్‌తోగానీ, కొబ్బరి ఆకులతో గాని నీడ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే కూలీల పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ సదుపాయం కల్పించాలన్నారు. కూలీలు తెల్లటి వస్త్రాలతో తలపాగా చుట్టుకోవాలన్నారు. 90 రోజుల పని దినాలను దశలవారీగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వించాలన్నారు. 2024-25 బడ్జెట్ ప్రకారం 80లక్షల పనిదినాల మొత్తంలో 80శాతం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పూర్తి చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని, రూ..300 వేతనం రోజుకి అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ అడపా వెంకట లక్ష్మీ, ఏపీడీ వసంత మాధవి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నివాస్

మాతృ, శిశు మరణాలను తగ్గించాలి

● డాక్టర్ కె.రత్నకుమార్

కాకినాడ క్రైం, ఏప్రిల్ 4 : జిల్లాలో మాతృ శిశు మరణాల నివారణకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డాక్టర్ కె. రత్నకుమార్ అన్నారు. గురువారం కాకినాడ వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్ అధ్యక్షతన మెడికల్ ఆఫీసర్లుకు పవర్ ప్రజంటేషన్ ద్వారా మొదటిదశ శిక్షణా కార్యక్రమం జరిగింది. సీహెచ్‌సీ డాక్టర్లు ఆర్. జగదాంబ, సౌజన్య, శ్రావణి ఎ.ఆర్.ఎం. ఎం.ఎన్, ఎన్‌జీవోలుగా వ్యవహరించారు. శిక్షణా కార్యక్రమాలు చేయడం ద్వారా మాతృమరణాలు అరికట్టడంలో కమ్యూనిటీస్థాయి, ఫెసిలిటీ లెవెల్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, గర్భ సమయంలో అన్ని పరీక్షలు ప్రమాద గర్భిణుల గురించి సకాలంలో ఆసుపత్రికి మెరుగైన ప్రసవ సేవల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.రమేష్, ఇంచార్జ్ జడ్‌ఎంవో డాక్టర్ రాధాకృష్ణ, డీసీ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ గణాంకాధికారి బి.విజయలక్ష్మి, డిప్యూటీ గణాంకాధికారి గిరిగణేష్ పాల్గొన్నారు.

'ప్రత్యేక అవసరాల బాలలకు తోడ్పాటు'


సమావేశంలో మాట్లాడుతున్న అకడమిక్ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 4: సమగ్ర శిక్ష అడిషన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.రమేష్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలో భవితా కేంద్రాల్లోని విద్యార్థులకు అండగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు చెప్పారు. ప్రత్తిపాడు భవితా కేంద్రం వద్ద 1నుంచి 12వ తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లల ఉపకరణ పంపిణీ కోసం నిర్ధారణ నిమిత్తం విద్యార్థులు గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం ప్రతి మండలంలోని భవితా కేంద్రాలు నిర్వహిస్తామని వీరికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు శిక్షణ అందిస్తారని ఈప్రత్యేక అవసరాల బాలల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చేపట్టాల్సిన అంశాలను ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎంఈవోలు వి.రాజబాబు, వై. అచ్చిరాజు, ఆర్థోపెడిక్ వైద్యులు సీహెచ్ బావి తేజ, ఆప్తమాలజిస్ట్ ఎన్.రఘుపతి, ఈఎన్‌టీ కె.లావణ్య, సైకియాట్రిస్ట్ కృష్ణవాసన్, సీఆర్పీలు బాష, గంగరావు, మల్లేష్, భవితా కేంద్రాల ఉపాధ్యాయులు ఐఈఆర్పీలు, ఆయాలు పాల్గొన్నారు.

జగన్ ఐదేళ్ల పాలన కూల్చివేతలు, కుట్రలు, కేసులే

● ఉండూరు ప్రచారంలో ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఏప్రిల్ 4: కూల్చివేతలు, కుట్రలు, కేసులు, కక్షసాధింపులతో ఐదేళ్ల జగన్ పాలన సాగిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. గురువారం రాత్రి సామర్లకోట మండలం ఉండూరు గ్రామంలో కూటమి పార్టీల నాయకులు రాజా సూరిబాబురాజు, తుమ్మలబాబు, విత్తనాల వెంకటరమణ తదితర నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ ఇంటింటా ప్రచార కార్యక్రమాలను ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సూపర్ సిక్స్‌తో పేదల భవితకు గ్యారంటీ: దివ్య

తొండంగి, ఏప్రిల్ 4: చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పేదల భవితకు గ్యారంటీ ఏర్పడుతుందని తుని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి యనమల దివ్య పేర్కొన్నారు. గురువారం పెరుమాళ్ళపురం పంచాయతీ పాత చోడిపల్లిపేట, కడారిపేట, రాజీవ్‌నగర్ లక్ష్మణుడుపేట తదితర గ్రామాల్లో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, అరిగెల నర్శింహమూర్తి, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, కాలిబోయిన చంద్రరావు, కొయ్యా రామకేశవ, చిన అప్పలరాజు, అన్వేష్ పాల్గొన్నారు.

తునిలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

తునిరూరల్: తునిలో టీడీపీ కార్యాలయాన్ని నియోజకవర్గ పార్టీ శ్రేణులు అట్టహాసంగా ప్రారంభించారు. పట్టణ శివారు సాయినగర్ సమీపంలో ఏర్పాటుచేసిన కార్యాలయాన్ని మాజీ మున్సిపల్ కౌన్సెలర్ కుసుమంచి శోభారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ముఖ్యనేతలు ప్రసంగించారు. కార్యక్రమంలో తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, జిల్లా టీడీపీ ఉపా ధ్యక్షుడు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు,మోతుకూరి వెంకటేష్, నార్ల రత్నాజీ, జనసేన కో ఆర్డినేటర్ చోడిశెట్టి వెంకటేష్, మాజీ కౌన్సెలర్ మళ్ళగణేష్, దంతులూరి శ్రీనివాసరాజు, తమరాన సత్యనారాయణ ఉన్నారు.

గెద్దనాపల్లిలో టీడీపీ ప్రచారం

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లిలో గురువారం టీడీపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి వీరంరెడ్డి కాశీబాబు, బుర్రి శ్రీను, సూరిశెట్టి వెంకటశివ, బుర్రి శ్రీను, టీశెట్టి శ్రీను, మొల్లేటి త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమానికి టీడీపీ, జనసేన, జనసేన కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత హాజరై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

నెహ్రూ విజయానికి కలిసి కట్టుగా పనిచేయాలి

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విజయానికి ప్రతిఒక్కరూ కలిసికట్టుగా సైనికుల్లా పనిచేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో భావారం గ్రామం నుంచి వైసీపీకి చెందిన పడాల నారాయణ, పడాల సీతారామ్, పడాల కృష్ణభగవాన్, పినపర్తి కృష్ణ, తదితర కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి జ్యోతుల నవీన్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ నవీన్ పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. దేవరపల్లిమూర్తి, కంచి కృష్ణార్జున, నాగం విష్ణుమూర్తి, కంచి మణిబాబు, కర్రి రంగబాబు, పడాల లచ్చబాబు, పల్లకృష్ణ, కంచి శ్రీనివాస్, సైయిపు రెడ్డి రాజబాబు, పదిలం బుజ్జిబాబు, కంచిపండు, కంచి రంగబాబు, రాంబాబు పాల్గొన్నారు.

జనసేన నాయకుల ఇంటింటా ప్రచారం

పిఠాపురంరూరల్: పిఠాపురం మండలం మాదవపురం గ్రామం లో జనసేన నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. పవన్‌కోసం పాదయాత్ర పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా జనసేన నాయకుడు ఊటా నానిబాబు పల్లెనిద్ర చేస్తున్నారు. మాధవపురంలోని ఆలయాల్లో పూజలు అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మహేందరరెడ్డి, తెలంగాణా విభాగం అధ్యక్షుడు శంకరగౌడ్, రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్, చక్రవర్తి పాల్గొన్నారు.

రంగంలోకి జనసేన డిజిటల్ ప్రచార రథాలు

పిఠాపురం, ఏప్రిల్ 4: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న నేపథ్యంలో ప్రచారానికి డిజిటల్ ప్రచార రథాలను తీసుకువచ్చారు. ఆటోలు, వ్యాన్‌లకు ఎల్‌ఈడీ స్ర్కీన్లు అమర్చి వాటిపై పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచారం, ప్రసంగంలోని ముఖ్యాంశాలను వివరిస్తూ వీడియోలు ప్రదర్శిస్తున్నారు. వీటితోపాటు పవన్‌కు మద్దతుగా వివిధ వర్గాలు నిర్వహిస్తున్న ప్రచారాలను ఇందులో చూపుతున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు కొత్తపల్లి మండలాల్లోని 54గ్రామాలను కవర్ చేసే విధంగా ఈ డిజిటల్ ప్రచార రథాలను సిద్ధంచేసి గురువారం ప్రారంభించారు. ప్రదాన కూడళ్ల వద్ద నిలిపి వీడియోలు ప్రదర్శిస్తున్నారు. జనసేన పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రచార రథాలపై పవన్‌కల్యాణ్ కేరాఫ్ పిఠాపురం అనే స్లోగన్‌లు రాశారు.

అదరించండి... అభివృద్ధి చేసి చూపిస్తా: సత్యప్రభ

శంఖవరం, ఏప్రిల్ 4: ప్రజలందరూ నాకు అండగా ఉండి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కత్తిపూడిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం కత్తిపూడిలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సత్యప్రభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరగా వీరికి సత్యప్రభ పార్టీ కండువా కప్పి ఆహ్వానిం చారు. ఈకార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్య బాబు, మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు బద్దిరామారావు, పర్వత సురేష్, జనసేన నాయకుడు మేడిశెట్టి సూర్యకిరణ్, కిర్తి సురేష్, బీజేపీ కన్వీనర్ గంటాబాలు, జనసేన నేతలు కరణం సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

లంకవాసులకే ఇసుకపై హక్కు కల్పిస్తాం

తాళ్లరేవు: గోవలంక, పిల్లంక గ్రామాల వాసుల ఇసుక కార్మికులకు జీవనోపాధిని కల్పించే హక్కుకల్పిస్తామని టీడీపీనేత దాట్ల పృధ్వీరాజ్ అన్నారు. గురువారం స్థానిక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా దాట్ల పృధ్వీ మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకిరాగానే ఇసుకను పేదలకు అందుబాటులో ఉండేలా కార్మికులకు నిరంతరం ఉపాధిని కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నేతలు వేగేశ్న శ్రీను రాజు, మోర్త భైరవమూర్తి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చమురు నిక్షేపాల వెలికితీత నష్టపరిహారం సొమ్ము కాజేసిన ద్వారంపూడి

● జయహో బీసీ సమావేశంలో కొండబాబు

కాకినాడసిటీ, ఏప్రిల్ 4: కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో చమురు నిక్షేపాల వెలికితీత నష్టపరిహారం సొమ్ము రూ.వెయ్యికోట్లను ఐదేళ్లుగా ఎమ్మెల్యే ద్వారంపూ డి చంద్రశేఖరరెడ్డి కాజేసి మత్స్యకారులను మోసం చేశాడని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏటిమొగలో జయహో బీసీ సమావేశం గురువారం నిర్వహించారు. అడుగడుగునా కొండబాబుకు స్థానిక ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మత్స్యకారుల శ్రమను ఐదేళ్లుగా ద్వారంపూడి దోపిడీ చేసి మత్స్యకారులను మోసం చేశాడన్నారు. సమావేశంలో మత్స్యకార నాయకులు బలసాడి రంగా రావు, పెనుపోతు సూర్యారావు, వనమాడి ఉమాశంకర్, సంగాని సత్తిబాబు, సంగాని చిన్ని, వనమాడి వీరబాబు, వనమాడి దర్మారావు, 14,15 డివిజన్ల అధ్యక్షులు అంగాడి దుర్గారావు, అరదాడి శివ, టీడీపీ నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు, మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, మల్లాడి రాజు, మల్లాడి ఏడుకొండలు, జనసేన నాయకుడు సంగాని ఈశ్వరరావు, బీజేపీ నాయకుడు కొక్కిలిగడ్డ గంగరాజు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పింఛన్ల పంపిణీ

● వృద్ధులు, మహిళలకు తప్పని అవస్థలు


చేబ్రోలు సచివాలయం-1లో సొమ్ములు రాక ఎదురుచూపులు చూస్తున్న పింఛన్ లబ్ధిదారులు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 4: సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. మండుటెండలో సొమ్ములు తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు పడిన అగచాట్లు అన్నీఇన్నీ కావు. రెండోరోజు సొమ్ములు సకాలంలో రాక వృద్ధులు, మహిళలు, వికలాంగులు పడిగాపులు పడ్డారు. తొలిరోజు అరకొరగానే పింఛన్ల పంపిణీతో రెండోరోజు గురువారం కొనసాగించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు సచివాలయం-1లో సొమ్ములు అయిపోవడంతో బ్యాంకునుంచి నగదు సకాలంలో రాక లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. గొల్లప్రోలు సచివాలయం-1 మేడపై ఉంది. సిబ్బంది కనీసం కిందకు వచ్చి సొమ్ములు ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు అవస్థలు పడుతూ ఎక్కాల్సి వచ్చింది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు మండలాల్లోని గ్రామాలు, జిల్లావ్యాప్తంగా ఎక్కడా పింఛన్ల పంపిణీ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు.

'పింఛన్ల పంపిణీలో వైసీపీ అబద్ధాలు'

సామర్లకోట, ఏప్రిల్ 4: రాజకీయ లబ్ధికోసమే పింఛన్ల పంపిణీని వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వైసీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. గురువారం సామర్లకోటలో విలేకరులతో మాట్లాడుతూ పింఛన్లను సకాలంలో వారికి అందజేయకుండా వైసీపీ రాజకీయ డ్రామా ఆడుతోందన్నారు.ఈ సందర్భంగా సామర్లకోట పట్టణ, మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మెట్టిచింతలో గిరిజన భూములు కబ్జా

● గిరిజనుల ఆవేదన

ప్రత్తిపాడు, ఏప్రిల్ 4: ప్రత్తిపాడు మండలం మెట్టిచింత గిరిజన గ్రామంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములు కబ్జాలకు గురవుతున్నాయని ఆ గ్రామ గిరిజనులు వాపోయారు. గురువారం మెట్టిచింత గిరిజనులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని స్థానిక విలేఖరులకు వివరించారు. తాతముత్తాతల నుంచి గ్రామంలో సాగు చేసుకుంటున్న భూములను కొందరు మైదాన ప్రాంతాలకు చెందిన భూస్వాములు, కబ్జాదారులు, దళారులు రంగ ప్రవేశం చేసి అన్యాక్రాంతం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై గిరిజనులు గట్టిగా నిలదీస్తుంటే దిక్కు ఉన్నచోట చెప్పుకోండి అంటున్నారని గిరిజనులు లోత రాజబాబు, అర్జున, నాగలక్ష్మి తదితరులు వాపోయారు. గిరిజన భూములతోపాటు ఉపాధి హామీలో అభివృద్ధి చేసిన రహదారులు కూడా కబ్జాకు గురవుతున్నాయని తెలిపారు. గిరిజనుల భూములను కబ్జాలకు పాల్పడే మాఫియాపై ఐటీడీఏ, జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పెద్దాపురం ఎస్ఐని బదిలీ చేయాలని ఈసీకి ఫిర్యాదు

పెద్దాపురం, ఏప్రిల్ 4: పెద్దాపురం ఎస్ఐ వెలుగుల సురేష్‌ను బదిలీచేయాలని రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది కర్రి సాయిశ్రీ తెలిపారు. పెద్దాపురంలో ఎస్ఐగా సురేష్ 2019నుంచి పనిచేస్తున్నారని ఈయనపై పలు శాఖాపరమైన ఫిర్యాదులు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో ఆయనను వీఆర్‌లోకి పెట్టారని, మళ్లీ పెద్దాపురం నియో జకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దవులూరి దొరబాబు ఆయనను ఇక్కడకు మళ్లీ తీసుకువచ్చారన్నారు. దీంతో ఆయన వైసీపీకి అనుకూలంగా పనిచేస్తూ, ప్రతిపక్ష పార్టీలకు చెందినవారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈయనపై పూర్తిస్థాయి లో విచారణ జరిపి తగుచర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎస్ఐపై విచారణ జరిపి నివేదికను అందజేయాలని ఈసీ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

సోమశేఖర్‌కు పడాల పురస్కారం


పడాల స్మారకపురస్కారం అందుకుంటున్న సోమశేఖర్

కోటనందూరు, ఏప్రిల్ 4: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయతల సంఘం ప్రథమ వార్షికోత్సవం, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల శతాధిక గ్రంధకర్త పడాల రామారావు 18వ వార్షికోత్సవం గురువారం రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటనందూరు మండలం ఇందుగపల్లి గ్రామానికి చెందిన కంఠంరెడ్డి సోమశేఖర్‌కు పడాల స్మారక పురస్కారంను తూర్పుగోదావరిజిల్లా అభ్యుదయ రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు కర్రి రామిరెడ్డి నుంచి పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ సభ్యులు, జమ్స్ గ్రూప్ సభ్యులు, మహర్షిరమణ తదితరులు అభినందించారు.

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా షాపుల ప్రారంభోత్సవం


ఏలేశ్వరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షాపులు

ఏలేశ్వరం, ఏప్రిల్ 4: ఏలేశ్వరం పట్టణంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ షాపులను ప్రారంభించారు. దీనికి వైసీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావుతో పాటు ఎమ్మెల్సీ అనంతబాబు హాజరయ్యారు. గతంలో ఇదే స్థానంలో షాపులు ఉండేవి. కోర్టు ఉత్తర్వులు ఉన్నా అతిక్రమించి వాటిని కూల్చి ఎమ్మెల్సీ అనంతబాబు ఒత్తిడితో ఏకపక్షంగా కొత్త వాటి నిర్మాణాలు చేపట్టారు. వాటిని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతబాబు గురువారం ప్రారంభించారు. వీటి ప్రారంభంపై పట్టణంలో కోడ్ ఉల్లంఘన జరుగుతుందని, షాపుల్లో పార్టీ స్టిక్కర్లు అతికించారని ఎన్నికల అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై నగర పంచాయతీ కమిషనర్ శివప్రసాద్, ఎస్ఐ సతీష్ వచ్చి పర్యవేక్షణ చేయగా ఏమీ లేవని వెనుదిరిగారు. షాపు యాజమానులు కొందరు అనంతబాబుకు, సుబ్బారావుకు పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం షాపుల వద్ద పార్టీ కరపత్రాలు పంచారు. ఇవన్నీ ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 4: అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ కళామందిర్ సెంటర్‌లో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు.న్యాయవాది బంగుటూరు మధుబాబు, సీఆర్పీ ఈ రాంజీ ప్రసాద్, సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, మూరా చిన్నిబాబు, అంగన్‌వాడీలు, మహిళలు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పోస్టర్లు ఆవిష్కరించారు.

రైలు ప్రయాణికుల భద్రతకు నిరంతరం కృషి

సామర్లకోట, ఏప్రిల్ 4: రైలు ప్రయాణికులకు నిరంతరం భద్రత కల్పించేందుకు రైల్వే యంత్రాంగం అన్ని విభాగాలలోనూ కృషి చేస్తుందని, ఇందుకు ప్రజలు సైతం అధికారుల కృషికి సహకరించాలని సామర్లకోట రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం. రమేష్‌లు పేర్కొన్నారు. గురువారం సామర్లకోట రైల్వేస్టేషన్ అతిథిగృహంలో ప్రయాణికులకు భద్రతాచర్యల ఏర్పాట్లపై అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రయాణికులు రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అనుసరించాల్సిన భద్రతా చర్యలపై పూర్తి అవగాహన కల్పించాల న్నారు. ఈ సమావేశంలో ఇంకా పలు భద్రతా అంశాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం లో శ్రీధర్, దేవి, పాయింట్స్ చీమెన్‌లు, తదితర ఫీల్డ్‌లైన్ స్టాఫ్ పాల్గొన్నారు.

వలంటీర్లను వైసీపీ వారు నియమించుకున్నవారే

రౌతులపూడి, ఏప్రిల్ 4: వలంటీర్లను వైసీపీవారు నియమించు కున్నవారేనని, ఐదు సంవత్సరాలు వైసీపీకే పనిచేశారని కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ అన్నారు. రౌతులపూడిలో బీజేపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ ఉమ్మాడి వెంకటేశ్వరరావుతో కలిసి గురువారం విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. వలంటీర్లు వైసీపీ మనుషులు కాబట్టి పెన్షన్ తీసుకునే వారు లక్షల్లో ఉన్నారని వాళ్ల ఓట్లను ప్రభావితం చేస్తారనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం తొలగించిందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఊటా నాగశ్రీను, యాదగిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బెండపూడి వలంటీర్ల రాజీనామా

తొండంగి, ఏప్రిల్ 4: బెండపూడి పంచాయతీకి చెందిన 23 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు గ్రామ కార్యదర్శి రాజబాబు తెలిపారు. గురువారం మూకుమ్మడిగా తమ రాజీనామా పత్రాలను తమకు అందించినట్లు ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దాపురం, ఏప్రిల్ 4: ప్రభుత్వం ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కొమ్మోజు సంజయ్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని 15 రైతుభరోసా కేంద్రాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామని చెప్పారు. ధాన్యం తరలింపునకు సంబంధించి వాహనాలను రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతీ కొనుగోలు కేంద్రంవద్ద కొను గోలుకు సంబంధించిన విధి విధానాలు తదితర అంశాలను ఫ్లెక్సీలను ఏర్పాటుచేయాలన్నారు.

పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ప్రారంభం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 4: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షకు ఉచిత కోచింగ్‌ను గురువారం ప్రారంభించారు. తాటిపర్తి పరిసర గ్రామాలకు చెందిన 125మందిపైగా విద్యార్థులు ఈ కోచింగ్ తరగతులకు హాజరయ్యారు. కోచింగ్‌లో భాగంగా అందించే స్టడీ మెటీరియల్, మోడల్ టెస్టు పేపర్లను ఆవిష్కరించారు. వీటిని ఉచితంగా అందజేస్తారు. డైలీ టెస్టులతోపాటు గ్రాండ్ టెస్టు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ట్రస్టు చైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ, సభ్యులు బత్తుల వీరభద్రరావు, ఆకొండి ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు గణేష్, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

● మాజీ ఎమ్మెల్యే వర్మకు చంద్రబాబు సూచన


టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రచారపత్రాన్ని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఏప్రిల్ 4: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సూచించారు.రామచంద్రపురం పర్యటనలో ఉన్న చంద్రబాబును గురువారం పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కలిశారు. అనంతరం చంద్రబాబు వర్మను బస్సులోకి పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడారు. పవన్ ప్రచారం నిమిత్తం రూపొందించిన కరపత్రాలను బాబుకు చూపించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తెలుగుదేశం ఓట్లు నూరుశాతం పవన్‌కల్యాణ్‌కు పడాలని సూచించారు. టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి పనిచేయాలన్నారు.

విజయానికి కలిసికట్టుగా పనిచేయండి

● చంద్రబాబును కలిసిన వురుపుల సత్యప్రభ


చంద్రబాబును కలిసిన పైల బోస్, ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రభ

ఏలేశ్వరం, ఏప్రిల్4 : సార్వత్రిక ఎన్నికల్లో కలిసికట్టుగా విజయానికి పనిచేయాలని చంద్రబాబు ఆదేశించారు. గురువారం రామచంద్రపురంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును కాకినాడజిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పైల సుభాష్‌చంద్రబోస్ మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రబాబు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ విజయానికి అన్నివర్గాల వారు సమన్వయంతో సమిష్టిగా కృషిచే యాలని సూచించారు.

వైసీపీ విధానాలతో ప్రజలు విసిగిపోయారు

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
● టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నేతలు

పెద్దాపురం/సామర్లకోట, ఏప్రిల్ 4: వైసీపీ అవలంభిస్తున్న అసత్యవ్యవస్థ విధానాల కారణంగా ఓ వైపు ప్రజలు, మరోవైపు పార్టీ నేతలు విసుగుచెందారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక బ్యాంకు కాలనీలో జనసేన పెద్దాపురం నియోజకవర్గ నేత తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో వారు గురువారం పాల్గొని మాట్లాడారు. ముందుగా వైసీపీ సీనియర్ నాయకుడు గోలి వెంకటప్పచౌదరి, వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కర్రి వెంకటరమణ ఇరువురూ రాజప్ప సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి చినరాజప్ప పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు నిమ్మకాయల రంగనాగ్, రాజాసూరిబాబురాజు, చాగంటి గోపాలకృష్ణ, రంధి సత్యనారాయణ, అడబాల కమారస్వామి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కాకినాడ సిటీ: కాకినాడ అన్నదాన సమాజం డైరక్టర్, 43వ డివిజన్ కన్వీనర్ నమ్మి సత్యవాణి తన అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివాసం వద్ద వైసీపీనుంచి గురువారం టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ నియోజకవర్గ నాయకుడు వనమాడి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. నమ్మి రాజేష్, శ్రీగిరి సుజాత, మల్లిక, రామలక్ష్మీ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● ఏఐసీసీ పరిశీలకుడు మనోజ్ చౌహాన్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 4: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఏఐసీసీ పరిశీలకుడు మనోజ్ చౌహాన్ అన్నారు. కాకినాడ డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అత్యవసర సమావేశం గురువారం జరిగింది. దీనికి కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండు రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులు గా ఏఐసీసీ పరిశీలకుడు మనోజ్‌చౌహాన్, కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎం పళ్లంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు తొమ్మిది గ్యారెంటీ సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేపట్టాలన్నారు. ఏపీసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, కాకినాడ నగర అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, కాకినాడ సిటీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి చెక్కా నూకరాజు, రాష్ట్ర నాయకులు మట్టా వెంకటప్రసాద్, పోతురాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా నాగ శిల ప్రతిష్ఠ

పోర్టుసిటీ (కాకినాడ), ఏప్రిల్ 4: కాకినాడ నగరంలోని గాంధీనగర్ ప్రాంతంలోని కనకదుర్గాదేవి దేవస్థానం ఆవరణలో నాగశిల ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల తర్వాత దండుమహంతి వెంకటేష్, వాగ్దేవి దంపతులు ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషు మాజీ కార్పొరేటర్ దండుమహంతి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం జిల్లా జడ్జిను కలిసిన తునిబార్ అసోసియేషన్ సభ్యులు

తుని రూరల్, ఏప్రిల్ 4: రాజమహేంద్రవరం జిల్లా జడ్జి గంధం సునీతను తుని బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. తుని బ్యాంక్ కాలనీలో నిర్మాణం అవుతున్న కోర్టు పనులపై వినతిపత్రం సమర్పించారు. జడ్జిని కలిసిన వారిలో తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణశేఖర్‌తో పాటుగా సభ్యులు ఉన్నారు.